వరద వెల్లువ

శ్రీ బలివాడ కాంతారావు

వానలు కురిశాయి. సెలయేళ్ళు పొంగి, నదిలో కలిశాయి. ఏరు ఒడ్డు కూల్చుతూ చెట్లు పెకలించి, వరదలో వందలాది ప్రాణులను కలుపుకొని వుప్పొంగి పోతూ హోరుమంటూ దిగువకు దిగజారిపోతూంది అది ఉవ్వెత్తుగా పొంగిన వరద వెల్లువ!

తెలతెల వారే సమయం! దిగువన ఒక గ్రామంలో తెప్పలతో యీది కర్రలు తీసేవాళ్ళలో ఒకడు కర్ర అనుకొని శవాన్ని ముట్టుకున్నాడు. ఒళ్ళు జలదరించింది! ఒడ్డుకు ఆయాసంతో చేరుకున్నాడు. ఆ శవం అలా కొట్టుకొని పోతూ పోతూ ఆ గ్రామానికి దక్షిణంగా రెండుమైళ్ళల్లో ఉన్న పర్రలో ఒక తుప్పకు చిక్కుకుంది. నీటి సత్తువను మేటిదైన జలధి లాగుకున్నది. సాయంత్రం అయేసరికి వరద నీరు తగ్గనారంభించింది. తెల్లవారేసరికి ఆ శవం ఆగినచోట లేదు. రాత్రంతా నక్కలే కాక, తెల్లారేసరికి రాబందులుకూడా కొల్లలుగా చేరి ఫలహారం చేశాయి. మిగిలింది అస్థిపంజరం. పర్రలో చేరి చెత్తను పూడ్చుకొనటానికి వెళ్ళినవాళ్ళలో సంచలనం బయలుదేరింది. గ్రామాధికారుల చెవులకు యీ వార్త చేరగానే పోలీసులు రావటం జరిగింది!

ఈ యెముకలగూడు శవపరీక్షకు పట్నం పోయింది.

“అయ్యో! పాపం! ఎంత పెద్దింటి యిల్లాలో! కాలుజారి పడివుంటుంది. బలవంతం చావైతే నగలన్నీ యెందుకు పెట్టుకుంటుంది...” ఇలా వూళ్ళో తలోలా అనుకున్నారు. ఆమెనుగురించి వారం రోజులవరకూ మనిషో వార్త తెచ్చేవారు. అన్నీ నమ్మదగ్గట్టుగానే వుండేవి.

పోలీసు సేవనుకు మొగుడన్న మనిషి రాగానే అసలు సంగతి ఆయనవలన కాకుండా వెంటవున్న వారివలన తెలిసింది.

“ఆ మొగాడు...రామరామ. ఆ యేడుపు... చూడలేం! అంతటి వాడి పరువు పూర్తిగా తియ్యాలనే నగలతో యీపని చేసిందిగా!”

“అలాంటి దానికి యిలాంటి చావురాక మంచి చావొస్తుందా?”

ఇలా మనిషోలా అనుకున్నారు. విన్నవాళ్ళు వుదంతాన్ని మరికొందరితో చెప్పుకున్నారు. ఆకొందరు మరికొందరితో చెప్పారు. ఇప్పటికీ ఆ చుట్టుపట్ల యే ఆడది దిగజారినా యీామె కథే చెప్పుకుంటారు!

ఆమె పేరు రాజమ్మ. మహారాణికివుండే ఠీవితో శరీరం పొందికతో వుండేది. ఆ కళ్ళల్లో యేదో గంభీరమైన మెరుపు. ఆ శరీరచ్ఛాయలో పగడపురంగు కలిసింది! పెద్దింటిపిల్ల. తండ్రికి నూరెకరాల పొలం - ఒక్కర్తే కూతురు. అత్తవారిది సిరి రెట్టింపు. భర్త ఉదారుడు. చెయ్యి చాచకుండా యిచ్చినదాత. ఏ సత్కార్యంలోనైనా తనే! పొలంగట్టున నిలుచున్నాడంటే యెడ్లజతలు కూడా నమ్రతతో వుత్సాహంతో పనిచేసేవి. ఆ శాంత గంభీరస్వరం ఆలించి పాటించేవారే అందరూ! అలాంటి మకుటంలేని మహారాజు భార్యగా వచ్చింది. యిద్దరుబిడ్డల తల్లిఅయింది. అయినా ఆమె నిత్య యౌవని — లోతైన చెరువుమధ్యలో పద్మంలా ఆమె యెవరికీ అందలేదు — బహుశః భర్తకుకూడా నేమోనని కొన్నాళ్ళకిగానీ అతడు పోల్చుకోలేకపోయాడు.

పైకి పద్మంలా అగుపించినా లోన గట్టి కాడలా ఆమెలో యేదో కఠినత్వం, ఆ దిగువ బురదలా యేదో మలినం...ఆమె హృదయంలో దాగుంది. పురుషుల మీద ఒక నీరసభావం ఏర్పడింది. తనకు తెలియని గర్వం ఆమెను వెగటుగా అంటుకుంది.

బ్రతుకు తెరువుకోసం చేపలుపట్టడానికి చెరువు మధ్యకు చేరిన జాలరివానిలా పిమ్మన్న వీళ్ళ యింట్లో నౌఖరుగా చేరాడు. ఇద్దరుపిల్లలతండ్రి పెళ్లాం సన్నంగా నల్లగా పెద్దబుట్టలాంటితలతో అసహ్యంగా వుంటుంది. వ్యవసాయపు కూలిపని చేసుకొని ఆమె, భర్త యీ పెద్దయింటిలో నౌకరీచేసి, తెచ్చుకున్న ధాన్యంతో కాలంగడవాలి. పిమ్మన్నకు ప్రక్కవా

డేమనుకున్నదీ అక్కర్లేదు. ఒకడి జోలికిపోడు— ఒకడిచేత ఒకమాట అనిపించుకోడు. మొగవాళ్లకుండే పౌరుషాలు లేవు, మోటుదనం లేదు. బహు నెమ్మదైన మనిషి. ఇంటియజమాని పీడి విషయాన్నీ మంచినీ గౌరవించాడు. ఎవరికీ యివ్వని స్వతంత్రం ఇచ్చాడు. ఇంటి యిల్లాలికి, సిమ్మన్నలో మిగతా మగవాళ్లలో లేని అందమేదో అగుపించింది. ఇన్నాళ్లూ తను కోరుకున్నదేదో దొరికినట్లు, ఎదురుచూస్తున్న మనిషి వచ్చినట్లు, స్త్రీమూర్తి ఆమె కంటికి సిమ్మన్నలో గోచరించింది—

పద్మం, కోరి జాలరివాని భుజానికి తాకింది. బ్రతికినబ్రతుకు తలుచుకుని జాలరి అది తప్పించుకొని చేపలు పట్టుకోసాగాడు. బాగా విప్పారి భ్రమపెట్టింది ఆ ముగ్ధ. ఆ అందాన్ని చూడగానే జాలరిలో దాగున్న, అణచుకుంటున్న రసానుభూతి పొంగి పారింది. అప్పటికీ ప్రయత్నించాడు కానీ యెదురీద లేకపోయాడు. ఆప్యాయంగా ఆ పువ్వు తాకి చేతులతో చుట్టివేశాడు. హృదయానికి హత్తుకున్నాడు. తుమ్మెద ఝుమ్మంటూ వచ్చి వెంట తరిమింది. ఆలుబిడ్డలను, బ్రతుకు తెరువును మరచిపోయి ఖిన్నవదనంతో చెరువుగట్టుమీద సమయంకోసం వేచివున్నాడు. చీకటిపడింది. తుమ్మెద అప్పటికి గానీ పద్మాన్ని వదల్లేదు. మెల్లగా చెరువులో దిగి యీదుకుంటూ వెళ్ళాడు. నక్షత్రపు వెలుగులో అర్ధనిమీలిత నేత్రయై యెదురుచూసున్న ప్రేయసి దగ్గరకు వెళ్ళాడు. ఆమె యేడ్చింది. ఆ యెడబాటు సహించరానిది. నెమ్మదిగా అన్నది. "చూడు యీ చెరువులో బురదా, తుప్పలూ ఎండ్రలూ, కప్పలూ, జలగలూ తప్పించి యింకేమీ లేవు నీ వెంతకాలం యీలోతైన నీటిలో యీ జలచరాలమధ్య యీదుకొనివుండగలవు? అందరికీ యీ నీరూ, యీగాలీ, యెంతో గొప్పలావున్నా నాకు మాత్రం అసహ్యం అయింది. పదపద యెక్కడికో పోదాం...స్వతంత్రంగా నీతో వుండగల చోటికి పోదాం;" అంది. చీకటి భయం భయంగా వుంది. ఏ సమయంలో యే జంతువైనా హాని చెయ్యవచ్చు. కోరివలచి వస్తోంది సుందరి—ఎన్ని జన్మలెత్తాలి యిటువంటి పుష్పాన్ని స్పృశించడానికి? పువ్వును కాడతో బురదనుంచి పైకెత్తాడు. చుట్టూనీరు కల్మషమైంది. ప్రక్కనేవున్న రెండుమొగ్గలు కావుమన్నాయి. పువ్వును పట్టుకొని ఒక మారుమూలలో వున్న కుగ్రామానికి తీసుకపోయి ఒక గృహంలో దాచాడు. ఆ అందాన్ని అనుభవించాడు. రానురాను పువ్వు వాడిపోజొచ్చింది. ఆ కంటికి పసందుగా అగపడటం లేదు. జాలరికి పెళ్ళాం పిల్లలు జ్ఞాపకం వచ్చారు. కొల్లలుగా చేపలుయిచ్చి అభిమానం చూపించిన ఆ చెరువు జ్ఞాపకం వచ్చింది. అయ్యో ఆ చెరువుమధ్యలో అంత అందంగా వున్న పువ్వునా నేను పీకివేశానని మథన పడసాగాడు. తిరిగి ఆ పువ్వును ఆ చెరువులో వేసి క్షమాపణ వేడుకోవాలనుకున్నాడు. తనవునికి త్రోవే పోయే ఒక మనిషికి తెలియజేశాడు.

ఒకనాడు తెల్ల తెలవారు సమయాన్ని యింటిముందు జోడెడ్ల బండి ఆగింది. ఆమె అందులోనించి దిగిన భర్తను, పెద్దలను, తన బిడ్డలను చూచింది. సిమ్మన్న గజగజ వణకనారంభించాడు. ఆమెకళ్ళు పగడాల్లా మెరుస్తున్నాయి. మనసును పాషాణం చేసుకుంది. అమ్మా అంటూ కావుమని పిల్లలు దగ్గరకు పరుగెత్తుకొచ్చారు. ఆ రాయి కదలేదు. మెదల్లేదు. ఆ దృశ్యం చూసిన సిమ్మన్నకు కళ్ళల్లో నీళ్లు గిర్రుమని తిరిగిపోయాయి. ఆ పద్మం కాగితంతో చేసి యెవరో చెరువులో వేసి తనను మభ్యపరచినట్లనిపించింది, ఆమెభర్త పిల్లలను చేరదీసి "ఇంకా ఇంటికి రావా?" అన్నాడు ఆ గొంతుకలో మర్యాద వుట్టిపడుతోంది. ఊర్లో ప్రజ మూగిపోయారు. "రాను" అంది రాజమ్మ కటువుగా. భర్త కాస్త దగ్గరగా జరిగి "నన్ను గురించికాదు. ఆరోజునుంచీ యీపిల్లల యేడుపు వినలేకపోతున్నాను. అన్నీ యివ్వగలను గానీ...... తల్లిప్రేమ యివ్వగలనా ... వీళ్ళమీదైనా కనికరం చూపించి తిరిగి రావా రాజమ్మా?"

అతని మర్యాద, ఓరిమి, ఆమెకు కనిపించలేదు. వినిపించలేదు. "అన్ని వదులుకో నేవచ్చాను. నీ వెవ్వరో నే నెవరో...!" అంది

"అంతేనా..." అన్నాడు.

అతని మాటలా పాషాణాన్ని కరగించకపోగానే ఆ గుంపులో ఒక వయసు మళ్ళిన వ్యక్తి ముందుకు వచ్చి "ఇల్లు వదిలిన యిల్లాలు, చెట్టువదలినకోతీ ఒక

టమ్మా! అన్నిటికీ సహించిన ఆమా రాజుకో యెదు రాడతావు...?"

ఆమె యెఱ్ఱగించి చూసింది. శరీరమంతా పౌరుషంతో మండుతుపోతూంది. "నాకు వీళ్ళెవరూ తెలీదు. నాకు తెలిసినవాడు అదుగో...వాడొక్కడే...మీరంతా పొండి...పోతారా లేదా?" ఆమె కసిరి వేసింది. ఆమె నిప్పులు కక్కుతూంటే సిమ్మన్న కూడా ఉలిక్కి పడి భయపడ్డాడు. ఆ ముసలి గంభీరమైన గొంతుక మళ్ళీ వినిపించింది. "ఓ అమ్మా! ఇప్పుడు ఒళ్ళు బింకంతో వున్నావు. నీకేమీ తెలిసిరాదు. దేవుడూ లేడు! నీతీ లేదంటావ్. కాస్త వాడిపోగానే నీ దరికి వీడూ చేరడు. ఎక్కడో మారుమూలల్లో గతి లేక చచ్చి నక్కలచేత, కుక్కలచేత, రాబందులచేత పీకించుకుంటావ్?"

"నేను చచ్చాక నాకేమైతేనేం? నేను చూడొచ్చానా? నాకు సిమ్మన్నతోనే బ్రతుకూ చావూనూ! వాడి చేతులతో నన్ను పొడిచినా నేను సంతోషంగా చచ్చిపోతాను. ఈ లోకంలో వాడొక్కడు తప్పించి నాకింకెవరూ లేరు."

అంటూ ఆమె అక్కడనుంచి గబగబ కదిలి పోయింది. చుట్టూ మూగినవాళ్లు 'ఛీ ఛీ' అన్నారు. తుప్పున వూశారు. "అది మనిషి కాదు పశువు!" అన్నారు. "దానికైనా కొంత నీతుంటాది. దీనికి లే"దన్నారు. నానా దుర్భాషలూ ఆడారు. ఒక మూల తలపట్టకొని కూర్చుండిపోయిన యజమానిని చూడగానే సిమ్మన్న దగ్గరగాపోయి కాళ్లు పట్టుకొని వలవలా యేడ్చేశాడు.

"నా నౌఖరుగా వుండొద్దు. నాతో పరిసమానంగా వుండు" అన్నాడు. సిమ్మన్న గతుక్కుమన్నాడు. అతని పాదాలొత్తడానికి పనికొస్తాడాతను... యెన్ని అంతస్థులు తేడా!

"నీకు కొంతపొలం యిస్తాను. దున్నుకొని హాయిగా బ్రతకండి!"

ఈ మాటలు సంతోషంతో పాటు భయాన్ని కూడా రేకెత్తించాయి. ఎందుకో గుండె దడపట్టుకుంది. యీ భూమి యిచ్చి తన పిల్లాపాపతో బ్రతకమన లేదే! ఈమెతోనా? ఈ రాయితోనా తన కాపరం? వద్దని చెప్పబోయాడు. చెప్పలేక పోయాడు. అంతదూరంలో నున్న ఆమెను చూడగానే తనకు భయం వేసింది. పిశాచిని చూచినట్లయింది. మొగుడు నిల్చున్నాడు. "రండి! ఇద్దరూ బండియెక్కండి" అన్నాడు. ఆ గంభీర శాంత స్వరాన్ని పాటించే అలవాటుకొద్దీ సిమ్మన్న బండివేపు నడవగానే ఆమె ఆపడానికి పరుగెత్తుకు వచ్చింది. "వద్దు వద్దు...మళ్ళీ ఆ నరకానికి వెళ్లొద్దు మనం...ఇక్కడే యిలాగ వుండిపోదాం. ఒక్కసారే యిద్దరు ఇక్కడే చచ్చిపోదాం!"

ఆమె ధాటికి సిమ్మన్న జంకిపోయాడు. కాళ్లు కట్టుకున్నట్లు నిల్చుండిపోయాడు. ఆమె భర్త ఒకసారి ఆమెవేపు యెగాదిగా చూశాడు. ఆమె శరీరం జలదరిస్తోంది. కోపంతో కంపిస్తోంది. మతిచెడిన మనిషిలా కొద్దిగా పిచ్చిచేష్టలు అగపడ్డాయ్. అంతమందిలో సిమ్మన్న చెయిపట్టి లాగే ఆమె సాహసాన్ని చూసి పౌరుషాన్ని ఆపుకోలేక పోయాడు. బిగ్గరగా "వాణ్ణి త్రాళ్లతో కాళ్లు చేతులూ కట్టి బండిలో వెయ్యం"డని హుకుం జారీ చేశాడు.

ఆ ఆజ్ఞ అరనిమిషంలో శిరసావహించడం జరిగింది. బండి కదిలిపోతోంది. ఆమె యెంత గుంజాటన పడినా లాభం లేకపోయింది. ఊళ్లోవాళ్లు వున్న సామానులు బయట పడవేసి "నీలాంటి నీచురాలు మా వూర్లో వద్ద"ని కేకలు వేశారు. ఆమెకీ కేకలేవీ వినిపించలేదు. బండి వెనుక పరుగెత్తింది. కొంత దూరం పోయాక భర్త బండి ఆపించి "మీదికి రా!" అన్నాడు.

"నేరాను...సిమ్మన్న కట్లు విప్పు...ఎక్కడికో పోతాం!"

మళ్ళీ బండి తోలించాడు. ఎంత బ్రహ్మాండమైన యెండ...పొలాల త్రోవలోనుంచి యెడ్లబండి పరుగులెత్తుతోంది. ఆమె కాళ్లు బొబ్బలెక్కిపోయాయి. స్నానం చేసినట్లు చెమట కారుతోంది. దాహం బ్రహ్మాండంగా వుంది. కాళ్లు పట్లుతప్పి పీకెడుతున్నాయ్. శరీరమంతా కందిపోయింది. విరబోసిన జుత్తుతో వున్నకొద్ది శక్తితో బండివెనుక పరుగెడుతోంది... అదిగో ఊరు! ఒళ్లు స్వాధీనంతప్పుతోంది. ఎదురుగా బండి రెండు బళ్లుగా అగపడి...మసగ మసగ్గా...అగుపించి...ఒక్కసారి మాయమైపోయింది. బండి ఆగింది. మొగుడు మూర్ఛపోయిన రాజమ్మను బండిమీద వేశాడు. నీరు చల్లాడు. ఆమెకు తెలివివచ్చే

సరికి చాల రాత్రయింది. మాట రాలేదు. తను ఎక్కడ వున్నదీ సరిగా గుర్తు రాలేదు. ఆకలి వేస్తున్నట్లు సైగ చేసింది. కడుపునిండాక సత్తువ వచ్చింది కానీ ఒళ్లంతా పట్లుదేరినట్లుంది. చుట్టూ మూగివున్న స్వజనంవైపు చూడకుండా బోర్లపడి పడుకుంది. తెలివి వున్నా నిద్రలో వున్నట్లే నటించింది. ఆ రాత్రంతా తన కాళ్ల వేపు యెవరో కుర్చీమీద కూర్చున్నాడు. అప్పుడప్పుడలా విసురుతున్నాడు చిన్న పిల్లవాడు యేడుస్తుంటే వెళ్లి జోకొడుతున్నాడు. ఆమె వుదయం లేచేసరికి కుర్చీమీద కూర్చొనే కునుకుతున్న భర్త అగుపించాడు.

'మళ్ళీ యీ కైదులో యెందుకు వేశావ్ దేముడా!' అనుకుంది. ఎవరితోనూ మాట్లాడ లేదు. ఎవరు మాటలు కలుపుతున్నా ముఖం త్రిప్పివేస్తోంది తనకు కావలసినవన్నీ అడక్కుండా దగరకు వస్తున్నాయ్. ఎప్పటికి చీకటి పడుతుందని యెదురుచూసింది. చీకటిపడింది. నడిరాత్రి...కదలడానికి వీలులేకుండా భర్త కాపలా కాస్తున్నాడు...ఒకటి రెండుసార్లు లేవటానికి ప్రయత్నిస్తే మొగుడు యేంకావాలన్నాడు. జవాబు చెప్పకుండా పడుకుంది. ఈలోగా వురుములు ప్రతిధ్వనిస్తున్నాయి. లేచి భర్త వేపు చూసింది. అలా కుర్చీమీద కూర్చొనే చిన్న మాగన్ను నిద్రపోతున్నాడు. కదులుదామనేసరికి దబదబ వర్షం ముంచుకొచ్చింది. ఆ వానజల్లుకు లేచిపోయాడు. కూర్చున్న రాజమ్మను చూచి "నిద్దర రాలేదా"" అన్నాడు.

జవాబులేదు కానీ అలా ఆమెవేపు దృష్టి సారించి చూశాడు. అతనిలో యేదో భావుకత్వం పొంగిపొరలింది. ఆమెపై సహజంగా తనకున్న అనురాగం పుష్టించింది. కనికరం వేసింది. అరచేతిని ముడిచి కుడి అరచేతితో ముడిచిన తన చేతిని లాలిస్తున్నట్లు నిమురుతూ..."యేదో తప్పు చెయ్యకపోతే మనిషెలా అవుతాడే...నీకు ఎందులోనో లోటు చేసివుంటాను...చందమామకి మచ్చవున్నా చూచేవాళ్ళకి ఒళ్ళు పులకరిస్తుందిగా...ఏమంటావ్!"

ఆమె వికారంగా "గంగలో దూకుతానంటాను!" అంటూ మళ్ళీ జేరబడిపోయింది.

"నీవు మంచిదానివే...నీనోటంట అలాంటి మాటలు హాస్యానికైనా రాకూడదు!"

"నీకే అంతా నిజం...నాదే అంతా అబద్ధంలే...ఊరుకో" అంది.

ఈ నాగును పట్టి పాములపెట్టెలో పెట్టినా యింకా మచ్చిక చేయలేక పోతున్నానని పాములవాడు చివుక్కుమన్నాడు.

ఆ మరునాటిరోజు మధ్యాన్నం అయేసరికి ఆ వూరికి అనుకునిఉత్తరక్షణాలుగా పాకేయేరు ముంచుక వచ్చింది. ప్రవాహం రానురాను పెద్దదై చీకటిపడేసరికి యేరు రెండు ఒడ్డులకు అంటుకొని పాగుతోంది. హోరుమనే శబ్దం మైలుదూరం వినిపిస్తోంది. వానలవల్ల చెరువులు నిండాయ్, కప్పలు బెక బెక డప్పులు కొడుతున్నాయ్. కాలువలు నిండి పొలాల్లోపారి వుభాలు మొదలుపెట్టించాయ్. పనిపాట్లలో జోక్యం చేసుకోకండా భర్త యింట్లో నేవున్నాడు. ఆమె ఆ రోజున లేచి తల గువ్వుకుంది. చీర మార్చింది. ఒంటినిండా నగలూ ముఖంనిండా బొట్టు పెట్టుకుని పేరంటాలులా పసుపు రాసుకొని తయారయ్యింది. ఆమెలో మార్పును చూచి భర్త సంతోషపడ్డాడు. ఆరాత్రి తనకు కంటి నింపుగా నిద్దరపట్టింది.

సిమ్మన్న ఒంటిగా తన యింటివాకిట మంచం వేసుకొని పడుకున్నాడు. కొంతవరకూ పిల్లలు తనమీద సవారీచేసి సంతోషపెట్టి యింట్లో నిద్రపోయారు. తరవాత పెళ్ళాం మాట్లాడి చాలా రాత్రయిందని పోయి ఇంట్లో పడుకుంది. చీకటిగావుంది. ఆకాశాన్ని నక్షత్రాలు మెరుస్తున్నాయ్. దగ్గరగావున్న యేటి గంభీరమైన అరుపు వినిపిస్తోంది. సిమ్మన్నకు నిద్దర రావటం లేదు. తన యజమాని...రాజమ్మ...అంతా జ్ఞాపకం వస్తున్నారు. యజమాని వుదారస్వభావం తలుచుకుంటుంటే ఒళ్ళు పులకరిస్తోంది. మనసులోనే దేవుడితో సమానమైన మారాజని మొక్కుకుంటున్నాడు. రాజమ్మ సౌందర్యమంతా కళ్లకు కట్టింది—ఎక్కడికండ అక్కడ—ఎంతో పొందికైన ఒళ్ళు—మంచి సారా త్రాగినట్లుంది ఆమెతో సంసారం! ఆ క్షణంలోనే తన పెళ్ళాం తలపుకొచ్చింది. ఇద్దర్నీ పోల్చుకోవటం జరిగింది. ఇదా వుత్తి యెర్రిబాగులది—మెత్తనిముద్ద—అది తాగకండా నా కెన్నిసార్లు గంజి పోసింది. దీని ఒళ్ళు కోస్తే అంతా మంచే! అభిమానమే! కాకపోతే సవితిని పట్టుకొని వూరూరా తిరిగావెందుకు? యింటికి తేలేకపోయావా అని అడుగు

తాదా? "నీకోసం అంత బ్రతుకూ కాలదన్నింది. నీతో నేను సుఖపడ్డాను. అదీ సుఖపడనీ—దాన్ని సెల్లెల్లాగ చూసుకుంటాను—దాని కింత సేస్తాను—" ఇలాగన్నాదే యిదెక్కడ? కన్నకడుపులో పుట్టిన పిల్లలు అమ్మా అని యేడిసి మీదికొస్తే కదల్లేదు. మెదల్లేదు అదెక్కడ? అది మనిషిపుట్టక పుట్టలేదు. దాన్ని కోసే అభిమానమే లేదు. అలాంటిది నాయింటికొస్తే పులిలాగ నన్ను మింగేస్తాది—దాని కడుపులో ఒక పిల్ల పుట్తే నా పిల్ల పీకలు పిసికేస్తాది! దానికి వూర్లోనే చోటు యివ్వకూడదు. మూడుముల్లూ కట్టానా రండ్డో మొండ్డో భరించడానికి? దానికీ నాకు సమ్మంధం యేం వున్నాదని యిలా ఆలోచించుకుంటూవుంటే యెవరో అతనిమీద చెయ్యి వేశారు. గతుక్కుమని తలెత్తేసరికి రాజమ్మ సింగారించుకొని వచ్చిన కామినీదేవతలావుంది. పదపద అన్నది తొందరగా. 'రాను' అని చెప్పటానికి నోరు కదల్లేదు. లేచాడు. ఆమె గబగబ నడుస్తోంది ముందుకు. మెల్లగా అడుగులు వేస్తున్న సిమ్మన్నను చూచి ఆగి "దా" అని పిల్చింది. గబగబ తనకు తెలియకుండానే కాళ్ళు కదలిపోయాయి.

ఊరు దాటారు. చుక్కల వెలుగులో యేటిఒడ్డు వెంబడే త్రోవలో పోతూనే వెనుకవున్నవాడిని ముందు నడవమని ఆమె త్రోవ తప్పుకుంది. ముందుకు నాలుగు అడుగులు వేసి ఆగి ధైర్యం చిక్కబట్టుకొని యెక్కడికి అన్నాడు ఆమె సహజగంభీరస్వరంతో "నీ వెంక నే వస్తాను...ముళ్ళత్రోవ కానీ...యినక దిబ్బలు కానీ...గంగలోనికి గానీ...గగనానికి గానీ...నరకానికైనా....నీతో నే వస్తాను...తీసుకుపో..." అంది.

సిమ్మన్నకు కాళ్లు సరిగా ముందుకు పడటంలేదు. ఈమెయందు అనురాగంకంటే అతీతమైన బంధనం తనను వెనుకను లాగుతోంది. ఆడమనిషిలోవుండే మానవత్వం తలుపుకువచ్చి యింటివేపు తిరిగి పరుగెత్తమని ప్రోత్సహిస్తోంది. పిల్లలపై కన్నతండ్రికి సహజంగా వుండే మమకారం మనసులో మథనం చేస్తోంది. ఈ జెబ్బలిని యెలా విడిపించుకోవటం—తన నిర్మలమైన బాటకు అడ్డుగా కాసింది. దోచుకుంటూ కలుపుకుంటూ బొబ్బలు పెడుతూ కదులుతున్న యేరు ప్రక్కనే వుందని స్ఫురించింది. మనసు కఠినమైంది. శౌర్య నిమగ్నుడై ఆగాడు.

ఆమె అతని భుజంమీద చెయ్యివేసి "చీకటని భయంగా వుందా?" అంది

"లేదులే..." అన్నాడు.

"పాము లుంటాయనా? అది నిన్ను కరిస్తే—నేనూ కరిపించుకుంటానులే...పద...పద...!" ఆమె కదలని అతనిని, తన అందమైన బాహువులతో చుట్టేసింది. ముఖంలో ముఖం పెట్టింది. సిమ్మన్నలో సంచలనం కలిగింది. ఆ నిశిలో నిశాచరుడయ్యాడు. పువ్వు పూర్తిగా నలిపివేసి ఉద్రేకంతో ఒక్కసారి గంగలోనికి త్రోసివేశాడు! తిరిగి యేమి తెలియనట్లు యింటివేపు నిద్రపోడానికి పరుగెత్తాడు.

రాజమ్మ చనిపోయి ఒక దశాబ్దం గడిచింది. ఆ గ్రామం వెళ్లేవాళ్ళకి యేటిఒడ్డున ఒక మనిషి కనిపిస్తాడు. యేటివేపు చూపిస్తూ "నన్ను రమ్మని పిలుస్తున్నాది! మీకు వినపడలేదా రాజమ్మ పిలుపు... అదిగో...అదిగో!" అంటాడు. ఆ చుట్టుపట్లవున్నవాళ్ళు 'పిచ్చి సిమ్మడు బాబూ, రేయీ పగలూ అదే మాట...అక్కడే వుంటాడు!" అంటారు.